క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



వ్యాపారులకు సూచనలిస్తున్న సీఐ, ఎస్సైలు

కంభం: వ్యాపారులు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని కంభం సీఐ కె. మల్లికార్జున సూచించారు. ఎస్సై నరసింహారావు తో కలసి శనివారం పట్టణంలోని చౌక్‌సెంటర్, బస్టాండు, ఇతర ప్రధాన కూడలిలలో తిరిగి ఆక్రమణలను పరిశీలించారు. రోడ్లపైకి వస్తువులు, బండ్లు పెట్టుకోవడం, రేకుల షెడ్లు వేసుకోవడం వల్ల రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. ఎవరి స్థలంలో వారు వస్తువులు పెట్టుకోవాలని సూచించారు. వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుకు ఉన్న బండ్లను, ఇతర వ్యాపారులను వెనక్కి జరిపించారు.

కనులపండువగా రథోత్సవం

● వేంకటేశ్వరునికి 108 కొబ్బరి బోండాలతో అభిషేకాలు

మార్కాపురం: భూదేవి, శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రణయనం ఉక్త హోమం, పుణ్యనదీ తీర్థాలతో పాటు 108 కొబ్బరి బొండాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర శతకలశ స్నపన చేశారు. రాత్రి 7 గంటలకు రథోత్సవం కనులపండవగా సాగింది. ఉభయ దేవేరులతో కలిసి స్వామిని రథంపై ప్రతిష్ఠించారు. మేళతాళాలతో పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఉటుకూరి రామకృష్ణారావు, గౌరవాధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం, కోశాధికారి పాదర్తి శ్రీనివాసులు, రాచమడుగు శ్రీనివాసరావు, యేరువ దేవిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రథోత్సవం వెంట ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కల్యాణ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

బీజేపీ నేతల సంబరాలు

మార్కాపురం టౌన్: ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు స్థానిక దోర్నాల బస్టాండ్‌లో సంబరాలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, అధ్యక్షులు పాదర్తి ఆంజనేయులు, బొంతల కృష్ణ, శాసనాల సరోజినీ, మద్దెల లక్ష్మి, సతీష్, రామకృష్ణ, వాసవీ ప్రియ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నేతలు

17న జీవనమూర్తి స్వామి వారి జెండా మహోత్సవం



జీవనమూర్తి స్వామి దేవస్థానం

రాచర్ల: మండలంలోని అనుములపల్లెలో జీవన మూర్తి స్వాముల వారి ఆలయ జెండా మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా దేవస్థానం కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ సోమవారం ఉదయం గంధం పూజ, 10 గంటలకు పావుకోళ్ల ఉత్సవం, రాత్రి 8 గంటలకు జీవనమూర్తి స్వామి వారి వేదాల పెట్టెలతో దేవస్థానం వరకూ ఉత్సవం నిర్వహిస్తారని తెలిపారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్నదానం చేస్తారన్నారు. 17వ తేదీ రాత్రి 10 గంటలకు గయోపాఖ్యానం, చౌచౌ నాటక ప్రదర్శన, రామాంజనేయ యుద్ధం, చింతామణి (భవాని సీను), సత్య హరిశ్చంద్ర పూర్తి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలి

రాచర్ల: మోటరు సైకిళ్లపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ వాడాలని ఎస్సై పి.కోటేశ్వరరావు అన్నారు. స్పందన విద్యా సంస్థల డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్ రెడ్డి, ఆర్టీసీ కండెక్టర్ శంకర్‌నాయుడు సహకారంతో రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు చేతులు మీదుగా రాచర్ల మండలంలోని పత్రికా విలేకరులకు హెల్మెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆదిశేషయ్య, రైటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

● వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టు వెంకటరెడ్డి



మెట్టు వెంకటరెడ్డి

కొనకనమిట్ల: పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన వైస్ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ మెట్టు వెంకటరెడ్డి అన్నారు. పార్టీ పెద్దలు తనపై నమ్మకం ఉంచి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించటంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటరెడ్డిని మండల పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా నరసింహస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ



కొమరోలు : దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటు గ్రామంలో నూతనంగా నిర్మించిన నరసింహస్వామి దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. గురు, శుక్ర, శనివారాలు నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించగా తాటిచెర్లమోటు పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మూడు రోజులపాటు మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసులరెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్మశాన స్థల ఆక్రమణపై ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీ మహిళలు

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ తూర్పు వైపున ఉన్న ఎస్సీలకు చెందిన శ్మశాన వాటికను శనివారం సాయంత్రం కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని కాలనీ దళితులు రాత్రి మార్కాపురం రైల్వేస్టేషన్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు రఫి, రాజు, రూబెన్ మాట్లాడుతూ దళితుల శ్మశాన వాటికను కొంత మంది ఆక్రమించేందుకు జేసీబీతో చదును చేయించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు పై కాలనీసులు ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఎస్సై సైదుబాబు అంకమ్మరావు సిబ్బందితో వచ్చి వారితో మాట్లాడారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అటువైపుగా వెళ్తూ ధర్నా చేస్తున్న కాలనీవాసులు దగ్గర ఆగి మాట్లాడారు. అధికారులతో మట్లాడతానని చెప్పడంతో ధర్నా విరమించారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మి చెన్నకేశవ స్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమో నమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



దర్శనమిస్తున్న శ్రీవారు